సాక్షి కర్నూలు

గురువారం, 5, జనవరి, 2023



అప్రమత్తతే ఆయుధం
ఎమ్మిగనూరురూరల్: విపత్తుల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బుధవారం బనవాసి నవోదయ విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



సింగోటం పిలుస్తోంది!
తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లాలో సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచి భక్తులు తరలివెళ్లనున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,623.91
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 72.982
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,551

న్యూస్‌రీల్

ఢిల్లీకి జెడ్పీ చైర్మన్
కర్నూలు(అర్బన్): భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి బుధవారం ఢిల్లీకి వెళ్లారు. రెండు రోజుల పాటు జరగనున్న వర్క్‌షాప్‌నకు రాష్ట్రంలోని నలుగురు జెడ్పీ చైర్మన్లు, ఐదుగురు జెడ్పీ సీఈఓలు, ఒక ఎంపీపీ, ఇద్దరు ఎంపీడీఓలు హాజరుకానున్నారు. బ్లాక్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (బీపీడీపీ), డిస్ట్రిక్ట్ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (డీపీడీపీ) రూపకల్పనపై వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించనున్నారు.



జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

రబీలో పక్కాగా ఈ క్రాప్ నమోదు
కర్నూలు(అగ్రికల్చర్): రబీలో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో పక్కాగా నమోదు చేయాలని వ్యవసాయాధికారులను జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) పీఎల్ వరలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో బుధవారం మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ జిల్లాలో రబీ సాధారణ సాగు 1,27,743 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 78,639 హెక్టార్లలో పంటలు సాగయ్యాయన్నారు. ఈ–క్రాప్‌లో పంటల నమోదు ప్రక్రియను ఏవో, ఏడీలు పర్యవేక్షించాలన్నారు. పీఎం కిసాన్ కింద అర్హత కలిగిన రైతులందరూ ఈ–కేవైసీ చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రబీలో పొలంబడి కార్యక్రమాలను మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీఏలు సాలురెడ్డి, గిరీష్, మహమ్మద్ ఖాద్రి, సునీత, మోహన్ విజయ్‌కుమార్, అగ్రానమీ ఏడీఏ బాలవర్ధిరాజు, సాంకేతిక ఏవోలు రామమేంద్ర, అల్లీపీర, ఉషారాణి, అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలియో వ్యాక్సిన్ ప్రారంభం
కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో చిన్నారులు పోలియో బారిన పడకుండా ఉండేందుకు ఇంజెక్టబుల్ పోలియో వ్యాక్సిన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ వ్యాక్సిన్‌ను 4 వారాలు, 6 వారాలతో పాటు 9వ నెలలో మీజిల్స్, రుబెల్లా టీకాతో పాటు చిన్నారులకు ఇవ్వనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి. రామగిడ్డయ్య తెలిపారు. ఇది చిన్నారులు పోలియోబారిన పడకుండా పటిష్టమైన రక్షణ వ్యవస్థగా పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్‌ను చిన్నారులకు వేయించవచ్చన్నారు.

స్కిల్ హబ్‌ల్లో నిరుద్యోగులకు శిక్షణ
కర్నూలు సిటీ: స్కిల్ హబ్‌ల్లో నిరుద్యోగ యువతి, యువకులకు 16 కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక హబ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. వీటిలో శిక్షణ పొందేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు 9676141731, 8500783459, 9177413642 నంబర్లను సంప్రదించాలన్నారు.

సుంకేసులలో 0.845 టీఎంసీల నీరు నిల్వ
గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌లో 0.845 టీఎంసీ నీరు నిల్వ ఉందని జేఈ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో పూర్తిస్థాయిలో గేట్లను మూసివేసినట్లు పేర్కొన్నారు. రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

సమ్మేటీవ్ పరీక్షల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

ఆదోని అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటీవ్ పరీక్షలను డీఈఓ రంగారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కొంతసేపు ముచ్చటించారు. ప్రశ్నపత్రం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నామని, ఆదోని డివిజన్ పరిధిలో 35 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. డీఈఓ వెంట ఎంఈఓ శివరాములు పాల్గొన్నారు.



నిండుగా ప్రవహిస్తున్న తుంగభద్ర దిగువ కాలువ



పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



వరినారు తీస్తున్న కూలీలు



నాట్లు వేస్తున్న దృశ్యం

వరించిన కాలం



ప్రకృతి సహకరించడం, ప్రభుత్వం మెరుగైన చర్యలు తీసుకోవడంతో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కింద ఆయకట్టు కళకళలాడుతోంది. మూడేళ్లుగా ఏడాదికి రెండు పంటలు పండుతున్నాయి. గతేడాది అక్టోబర్‌లో కర్ణాటక రాష్ట్రం మోకా సమీపంలో హగరి నదిపై ఎల్లెల్సీ ప్రవాహం కోసం నిర్మించిన వంతెన దెబ్బతినింది. ప్రభుత్వం స్పందించి వేగంగా మరమ్మతులు చేపట్టడడంతో ఖరీఫ్ పంటలు చేతికందాయి. రబీ సీజన్‌కు కూడా నీరు ఇస్తుండడంతో రైతులు ఆశతో వరి సాగు చేస్తున్నారు. మడులు సిద్ధం చేయడం, నారు తీయడం, నాట్లు వేయడం..తదితర పనులతో రైతులు బిజీగా ఉన్నారు.
– హొళగుంద

నిమిషం ఆలస్యమైనా అనుమతించం
కర్నూలు(లీగల్): ఈనెల 7వ తేదీన జరగనున్న జూనియర్ సివిల్ జడ్జి రాత పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ఏపీ హైకోర్టు అత్యంత కట్టుదిట్టంగా పరీక్ష నిర్వహిస్తోందని తెలిపారు.

సీఐడీ ఎస్‌పీపీగా నాగలక్ష్మీదేవి
కర్నూలు(లీగల్): సీనియర్ న్యాయవాది వి.నాగలక్ష్మీదేవిని క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్‌పీపీ)గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె మూడేళ్లపాటు సీఐడీ పోలీసులకు న్యాయ సహాయం చేస్తారు. ఇందుకు నెలకు రూ.40 వేల గౌరవ వేతనం అందుతుంది. నాగలక్ష్మీదేవి గతంలో రెండు పర్యాయాలు అదనపు పీపీగా విధులు నిర్వహించారు. ఆమె నియామకం వల్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

☛ కోడుమూరుకు చెందిన ఓ మధ్య వయస్కు వ్యక్తి కడుపు నొప్పితో స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. ఆయన కర్నూలు గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి అతన్ని రెఫర్ చేశారు. అక్కడ ఆసుపత్రిలో నాలుగు రోజులు ఉంచుకుని రోగికి రూ.90వేల బిల్లు వేశారు. ఇదేమని అడిగితే డబ్బు కట్టి వెళ్లి నీ ఇష్టమున్న చోట చెప్పుకోవాలని బెదిరించారు.

☛ కర్నూలు నగరానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి జ్వరం రావడంతో ఎన్ఆర్ పేటలోని ఓ వైద్యుని వద్దకు వెళ్లాడు. డెంగీ లక్షణాలున్నాయని చెప్పి ఆసుపత్రిలో వారం రోజులు ఉంచుకుని రూ.1.50లక్షలు బిల్లు వసూలు చేశారు. ఎందుకింత అయ్యిందంటే ప్రాణం మీదకు వచ్చినప్పుడు ఇవేమీ అడగరా? డబ్బులు కట్టేటప్పుడు బేరాలాడుతారా? అని ఎదురు ప్రశ్నించారు ఆ డాక్టర్.

భయమే పెట్టుబడి.. రోగుల ముక్కుపిండి!



‘పీడి’స్తూ..
కర్నూలుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో 90 శాతానికి పైగా ప్రాపెగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(పీడీసీ) మందులే విక్రయిస్తున్నారు. వీటిపై బ్రాండెడ్ మందుల కంటే రెండు నుంచి నాలుగింతలు అదనంగా ఎంఆర్‌పీ ఉంటోంది. బుధవారపేటలో ఉండే ఓ ఆసుపత్రిలో మెరోపీనమ్ ఇంజెక్షన్‌పై రూ.4వేల దాకా అదనంగా రోగులకు భారం అవుతోంది. బ్రాండెడ్ ధర రూ.400లకే లభిస్తున్నా వైద్యులు పీడీసీ మందులే రాసి దోచుకుంటున్నారు. ఆసుపత్రులే కాదు డాక్టర్ కౌంటర్ ఉన్న మెడికల్‌షాపుల్లో దాదాపుగా 80శాతం పీడీసీ మందులే రోగులకు అంటగడుతున్నారు.



ప్రయివేట్ ఆసుపత్రుల ధనదాహం

- అనుమతులు లేకుండానే క్లినిక్‌ల నిర్వహణ
- ఇష్టారాజ్యంగా ఫీజుల వసూలు
- అవసరం లేకపోయినా వివిధ రకాల పరీక్షలు
- ప్రాణాంతక వ్యాధుల పేరిట దోపిడీ
- చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ

కర్నూలు(హాస్పిటల్): తమ వద్దకు వచ్చిన రోగులను దోచుకోవడమే పరమావధిగా కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ఎలాంటి అవసరం లేకపోయినా వైద్యపరీక్షలు చేయించడం, ఏదో ఒక ప్రాణాంతక రోగముందని భయపెట్టి వేలకు వేలరూపాయలు వసూలు చేయడం పరిపాటిగా మారింది. దగ్గుతూ ఆసుపత్రికి వెళ్లినా జేబుకు భారీగా చిల్లు పడే పరిస్థితి నెలకొంది. ఆసుపత్రులను నియంత్రించే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టీపట్టనట్లు ఉండటంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ఫీ‘జులుం’

కరోనా మొదటి వేవ్‌లో కొన్ని క్లినిక్‌లు తెరవలేదు. కరోనా తగ్గాక ప్రైవేట్ క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో బాదుడు మొదలైంది. ఓపీ ఛార్జీలు రెట్టింపు చేశారు. గతంలో స్పెషాలిటీ వైద్యులు రూ.100, సూపర్‌స్పెషలిస్టు రూ.200 కన్సల్టింగ్ ఫీజు వసూలు చేసేవారు. ఇప్పుడు అది రూ.200 నుంచి రూ.500 వరకు చేరింది. ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతానికి వెళ్లి తిరిగి మళ్లీ ఇక్కడికే వచ్చిన ఓ డాక్టర్ తన ఫీజును రూ.150 నుంచి రూ.500కు పెంచేశారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరితే డిశ్చార్జ్ అయ్యేలోగా ఎంత అవుతుందో అంతే లేదు. చేరేటప్పుడు ఒక విధంగా, డిశ్చార్జ్ అయ్యే సమయంలో మరో అంచనాతో బిల్లు చేతికి వస్తోంది. జ్వర బాధితులకు కూడా రూ.90వేల నుంచి రూ.1.50లక్షల వరకు బిల్లు చేతికి వస్తోంది.

ఐసీయూ పేరుతో దోపిడీ

బుధవారపేటలోని ఓ ఆసుపత్రికి రోగి నడవలేని పరిస్థితిలో వెళితే నేరుగా ఐసీయుకే పంపిస్తారు. అక్కడ ఓ నాలుగురోజులుంచిన అనంతరం జనరల్ వార్డులో నాలుగురోజులు ఉంచి డిశ్చార్జ్ చేస్తారు. గతంలో సాధారణ ఆసుపత్రుల్లో రోజుకు ఐసీయూకు రూ.4వేలు వసూలు చేసేవారు. ఇప్పుడది రూ.10వేల నుంచి రూ.12వేల దాకా ఉంది. ప్రత్యేక గది కావాలంటే రోజుకు రూ.2వేల నుంచి రూ.4వేల వరకు చెల్లించాల్సిందే. ఇక నర్సింగ్ ఛార్జీలు, ఓటీ ఛార్జెస్, ఆక్సిజన్, వెంటిలేటర్ ఛార్జీలు అదనం.

కనిపించని ఫీజు బోర్డులు

నిబంధనల ప్రకారం ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లలో వసూలు చేసే ఫీజు వివరాల బోర్డును రోగులకు కనిపించే ప్రదేశంలో ఉంచాలి. పలు ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లలో బోర్డులు కనిపించవు. కొన్ని చోట్ల అధికారుల కోసమన్నట్లు ఓ మూలన వాటిని చిన్నగా రాసి పెడుతున్నారు. ఇవి రోగులకు మాత్రం కనిపించవు.



రిజిస్ట్రేషన్ లేకుండా..

అల్లోపతి మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ యాక్ట్–2007 ప్రకారం జిల్లాలో 280కి పైగా ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ల్యాబోరేటరీలు, స్కానింగ్ కేంద్రాలు, క్లినిక్, ఫిజియోథెరపి కేంద్రాలు రిజిస్టర్ అయ్యాయి. ఇవి గాకుండా రిజిస్ట్రేషన్ కాని ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు రెండింతలు ఉన్నాయి. వీటి వైపు వైద్యారోగ్య శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. కర్నూలులో కొత్తబస్టాండ్, ఎన్ఆర్ పేట, గాయత్రి ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కొన్ని ఆసుపత్రులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. అలాగే ఎమ్మిగనూరు, కోడుమూరులో ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. వీటిలో అధిక శాతం అర్హతలేని వైద్యులు, సిబ్బందే రోగులకు చికిత్స అందిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.



నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, ఫిజియోథెరపీ కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు అన్ని చోట్లా రోగులకు కనిపించే విధంగా ఫీజులకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలి. చాలా చోట్ల ఫీజు బోర్డులు కనిపించడం లేదు. ఈ విషయమై అన్ని ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం.
–డాక్టర్ వి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల ఆర్థిక సాయాన్ని అందించిన మంత్రి గుమ్మనూరు



ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

ఆలూరు: కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆస్పరి మండలం జోహరాపురం గ్రామానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రాంబాబు, జాఫర్ గత నెల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులకు రూ. 2 లక్షల (ఒక్కో కుటుంబానికి రూ. లక్ష చొప్పున) ఆర్థిక సాయాన్ని బుధవారం ఆలూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కో–ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, పార్టీ నేత రామసుబ్బారెడ్డి సమక్షంలో మంత్రి గుమ్మనూరు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ 96 శాతం పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం 96.74 శాతం పూర్తయ్యింది. మొత్తం 2,43,318 పింఛన్ లబ్ధిదారులు ఉండగా బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 2,35,385 మందికి నగదు అందజేశారు. జనవరి నెలకు సంబంధించి జిల్లాలో రూ.67.60 కోట్లు పింఛన్ నగదు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో రూ.60 కోట్లకుపైగా పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. పింఛన్ల పంపిణీ ఈ నెల 7వ తేదీ వరకు కొనసాగనుంది. కాగా.. పింఛన్ వారోత్సవాలు బుధవారం ఆదోని, ఆదోని అర్బన్, ఆస్పరి, కోడుమూరు, కృష్ణగిరి, మంత్రాలయం మండలాల్లో జరిగాయి. సంబంధిత ఎమ్మెల్యేలు కొత్త పింఛన్‌దారులకు పాస్‌పుస్తకాలు, ప్రొసీడింగ్స్, నగదు పంపిణీ చేశారు.

80 శాతం మందికి యథాతథంగా పింఛన్లు

నోటీసులు అందుకున్న వారిలో 80 శాతం మందికి యథాతథంగా పింఛన్‌లు పంపిణీ చేశారు. జిల్లాలో 9,169 మందికి నోటీసులు ఇవ్వగా వీరిలో 6,000 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. పింఛన్లను అడ్డగోలుగా తొలగించారని టీడీపీ, దాని అనుకూల మీడియా దుష్ప్రచారం చేసింది. ఇందులో వాస్తవం లేదని నిర్ధారణ అయింది.

‘ఉపాధి’ పనిదినాలు పెంచాలి

- సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులకు అధికారుల విన్నపం



మాట్లాడుతున్న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ మెంబర్ అశోక్ పంకజ్

కర్నూలు(సెంట్రల్): ఆదోని డివిజన్‌లోని కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద కల్పించే పని దినాలను 100 నుంచి 150కు పెంచాలని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులకు జిల్లా అధికారులు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులపై కలెక్టర్ పి.కోటేశ్వరరావు అధ్యక్షతన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ అశోక్ పంకజ్, ప్రొఫెసర్ సోనాల్ దేశాయ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ చిన్న తాతయ్య, జాయింట్ కమిషనర్ శివప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనుల్లో ప్రజలు కోరుకుంటున్న మార్పులు, చేర్పులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు పెడితే ఎక్కువ మంది సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. ఆదోని డివిజన్‌లోని కౌతాళం మండలం ఎరిగేరి, హాల్వి, అగస్తనూరులలో ప్రజలు వలస వెళ్తున్నారని, ఇక్కడ పని దినాలను 100 నుంచి 150కు పెంచితే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇదే మండలంలోని కెనాల్ పక్కన ఉన్న వల్లూరులో ప్రజలు ఉపాధి పనులకు రావడంలేదని, ఇలాంటి గ్రామాల్లో పని దినాలు 100రోజులు ఉన్నా సరిపోతుందన్నారు. కాల్వల్లో పూడిక తీత, రహదారుల పక్కన పొదలను కొట్టించడం, రోడ్డు విస్తరణ పనులు చేస్తే మంచిదని, వాటిని ప్రజల అవసరాల కోసం కూడా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉపాధిలో ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు పనులు చేసుకునేలా ఉందని, దానిని 10 ఎకరాలకు మార్చితే మంచిదన్నారు. అనంతరం ఎంపవర్డ్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ అశోక్ పంకజ్, ప్రొఫెసర్ సోనాల్ దేశాయ్ మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో ప్రజలు కోరుకుంటున్న మార్పులను చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశానికి ముందు సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ సభ్యులు తిలకించారు. జిల్లాలోని నీటి వనరులు ఎలా ఉన్నాయని, పంటలు బాగా పండుతున్నాయా అన్న విషయాలను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.



హాజరైన అధికారులు

అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కర్నూలు ప్రాజెక్టు డైరెక్టర్ కెఎల్ఆర్‌కె కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది ప్రాజెక్టుల్లోని 17 మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 94 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు 2022 జూలై 1వ తేదీ నాటికి 21నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. మహిళా అభ్యర్థులు తప్పనిసరిగా వివాహమై స్థానికంగా నివాసం ఉండాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే 18 ఏళ్ల పైబడిన వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అన్ని ధ్రువపత్రాలతో సమీపంలోని సీడీపీఓ కార్యాలయాల్లో గురువారం నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ముగ్గురు న్యాయవాదుల నియామకం



శ్రీకొండ మనోహర్ ఎం.శివరామచంద్రరావు

కర్నూలు(లీగల్): న్యాయవాదులను నియమించుకోలేని పేదల వాదనలు వినిపించేందుకు ప్రభుత్వం ముగ్గురు న్యాయవాదులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ (డిఫెన్స్)గా శ్రీకొండ మనోహర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డిఫెన్స్‌గా ఎం.శివరామచంద్రరావు, సహాయ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా న్యాయవాది ఎ.సులోచనలను నియమించింది. వీరి పదవీ కాలం రెండేళ్లు. వివిధ న్యాయస్థానాల్లో నిరుపేదల తరఫు న డిఫెన్స్ న్యాయ సహాయం అందిస్తారు. న్యాయవాదుల నియామకంపై బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఆర్.కృష్ణ, కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాటం రంగడు, న్యాయవాదులు వై.ప్రకాష్‌రెడ్డి, ఎం.ఎస్.రెడ్డి, సురేష్, అన్నపూర్ణారెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సింగోటం పిలుస్తోంది!

- ఈనెల 15 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు
- జిల్లా నుంచి వేలాదిగా వెళ్లనున్న భక్తులు
- కృష్ణానదిలో ప్రయాణంపై ఆంక్షలు
- ఆందోళనలో భక్తులు

వగిద్యాల: సింగోటం లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూలు జిల్లాలో వెలసిన ఈ స్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి వేలాది మంది భక్తులు తరలివెళ్లనున్నారు. దాదాపు ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఈనెల 16న కల్యాణోత్సవం, 17న ప్రభోత్సవం, 18న రథోత్సవం, 19న తెప్పోత్సవం నిర్వహిస్తారు. ప్రతి ఏటా శ్రీశైలం బ్యాక్‌వాటర్ మీదుగా ఇక్కడి భక్తులు ఇంజన్ బోట్లలో తరలి వెళ్లి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం అనాదిగా వస్తుంది. ఈ నేపథ్యంలో మూర్వకొండ, అర్లపాడ్ ఘాట్‌ల వద్ద సందడి మొదలైంది.


నదిలో ప్రయాణానికే మొగ్గు

కృష్ణానది అవతల వైపు ఉన్న సింగోటానికి వెళ్లేందుకు చాలా మంది భక్తులు బస్సు మార్గం కంటే నది ప్రయాణానికే మొగ్గుచూపుతున్నారు. పగిద్యాల, పాములపాడు, జూపాడుబంగ్లా, ఆత్మకూరు, శ్రీశైలం, నందికొట్కూరు తదితర ప్రాంతాల నుంచి సరైన బస్సు సౌకర్యం లేదు. కర్నూలుకు వెళ్లి అటు నుంచి మహబూబ్‌నగర్ మీదుగా సింగోటం వెళ్లాలి. దాదాపు ఐదారుగంటలు ప్రయాణమవుతుంది. అదే కృష్ణానది మీదుగా బోటులో అయితే రెండు గంటల్లో సింగోటం చేరుకుంటామని, సమయం, డబ్బు కూడా ఆదా అవుతుందని భక్తులు చెబుతున్నారు. అయితే, బోట్లలో ప్రయాణం ప్రమాదకరం కావడంతో అధికారులు నిషేధం విధించారు. సింగోటం జాతర నేపథ్యంలో నదిలో ప్రయాణానికి అనుమతించాలని భక్తులు కోరుతున్నారు. కాగా నదిలో బోట్లు తిప్పేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే తాము అనుమతిస్తామని ముచ్చుమర్రి సబ్‌ఇన్‌స్పెక్టర్ నాగార్జున తెలిపారు.



మంచాలకట్ట ఘాట్ నుంచి మూర్వకొండ ఘాట్‌కు వచ్చిన తెలంగాణ ఇంజన్ బోట్

మొదటి నుంచి వస్తున్న సంప్రదాయం



ప్రతి ఏటా సింగోటం జాతరకు జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్తారు. సరైన బస్సు మార్గం లేకపోవడంతో చాలా మంది నందికొట్కూరు నుంచి నెహ్రూనగర్ చేరుకుని మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల ద్వారా ఇంజన్ బోట్లలో వెళ్తారు. 2008 నుంచి రెవెన్యూ అధికారులు బోటుకు 20 మంది చొప్పున లైఫ్ జాకెట్లు ఇచ్చి అనుమతి ఇచ్చేవారు. ఈ సారి అధికారులు ఇంకా అనుమతి ఇవ్వలేదు.

– శ్రీనివాసులు, ఘాట్ నిర్వాహకుడు, నెహ్రూనగర్

దూరం, చార్జీల భారం తగ్గుతుంది



2007లో సింగోటం జాతరకు వెళ్లేటప్పుడు కృష్ణానదిలో పడవ మునిగి చాలామంది చనిపోయారు. ఆ తర్వాత నుంచి రెవెన్యూ, అగ్నిమాపక, నీటిపారుదల, మత్స్యశాఖ, పోలీస్ సిబ్బంది ఘాట్ల వద్ద దగ్గరుండి జాతరకు పంపించే వాళ్లు. బస్సు ప్రయాణం అయితే సాయంత్రమైన సింగోటం చేరుకోలేం. నది ప్రయాణం అయితే రెండు గంటల్లో జాతరకు చేరుకుంటాం. చార్జీ కూడా చాలా తక్కువ. అధికారులు స్పందించి బోట్లలో ప్రయాణానికి అనుమతించాలి – తిక్కస్వామి, నెహ్రూనగర్, భక్తుడు

రేషన్ బియ్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలుతోందని వచ్చిన సమాచారంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ హనుమంతయ్య, ఆర్ఎస్ఐ నాగేష్ తనిఖీ చేపట్టారు. మాధవరం గ్రామ శివారులో కర్ణాటక వైపు వెళ్తున్న లారీని నిలిపి తనిఖీ చేయగా 168 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించి మాధవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు తుంగభద్రకు చెందిన నాగేంద్ర, కర్ణాటక రాష్ట్రం మాన్వికి చెందిన వీరభద్రప్ప, లింగసూగూరుకు చెందిన లింగరాజు, శంకర్, రాచప్పపై కేసు నమోదు చేసి బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోడౌన్‌కు తరలించినట్లు మాధవరం పోలీసులు తెలిపారు.

భర్త చేతిలో భార్య దారుణహత్య

- అనాథలైన ఇద్దరు పిల్లలు

పత్తికొండటౌన్: పట్టణంలో బుధవారం పట్టపగలే దారుణం చోటుచేసుకుంది. ఆదోని రోడ్డులోని హీరో షోరూం సమీపంలో దాబా వద్ద గౌరీబాయి అలియాస్ గౌరమ్మ(33) అనే మహిళ భర్త రెడ్యానాయక్ చేతిలో దారుణహత్యకు గురైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను కూరగాయల కత్తితో పొడిచి హత్యచేసి భర్త పరారయ్యాడు. దీంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు..

తుగ్గలి మండలం ఎల్లమ్మగుట్టతండాకు చెందిన గౌరీబాయిని పత్తికొండ మండలం జీవరాళ్లమల తండాకు చెందిన సెనావత్ రెడ్యానాయక్‌కు ఇచ్చి 2005లో వివాహం చేశారు. వీరికి 9, 8 తరగతి చదివే ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల వల్ల భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో రెండేళ్ల క్రితం గౌరీబాయి భర్తను, పిల్లలను వదిలి వెళ్లిపోయి ప్రొద్దుటూరులో బంధువుల వద్ద ఉంటూ రొట్టెల చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. భార్య వదిలివెళ్లిన తర్వాత రెడ్యానాయక్ పత్తికొండ పట్టణం ఆదోనిరోడ్డులో దాబా పెట్టుకుని, పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తనకు భార్య నుంచి విడాకులు కావాలని కోర్టులో పిటీషన్ దాఖలు చేశాడు. ఈ నేపథ్యంలో భార్యభర్తలు కలిసి ఉన్నప్పుడు జీవరాళ్లమలతండాలో రంగానాయక్ అనే వ్యక్తికి రూ.50వేలు అప్పు ఇచ్చారు. ఇద్దరూ కలిసివస్తే అప్పు చెల్లిస్తానని రంగానాయక్ చెప్పడంతో గౌరీబాయి బుధవారం పత్తికొండకు చేరుకుంది. డబ్బు విషయమై స్థానిక ఆదోనిరోడ్డులోని దాబా వద్ద భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి లోనైన రెడ్యానాయక్ కూరగాయల కత్తితో విచక్షణారహితంగా భార్యను పొడిచి పారిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో విలవిల్లాడుతున్న గౌరీబాయిని బంధువులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ మురళీమోహన్, పోలీసుసిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. తల్లి హత్యకు గురికావడం, తండ్రి హంతకుడిగా మారడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోస్టుమార్టం అనంతరం బంధువులు మృతదేహాన్ని జీవరాళ్లమల తండాకు తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.



హత్యకు గురైన గౌరీబాయి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మిడుతూరు: మొక్కజొన్న చేనుకు పురుగు మందు పిచికారీ చేయడానికి వెళ్లి ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడిన ఘటన బుధవారం మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాలు.. సుంకేసుల గ్రామానికి చెందిన తెలుగు అచ్చెన్న, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు మద్దూరు మనోహర్ (23)తోపాటు చరణ్, జయరాముడు అదే గ్రామానికి చెందిన కురువ వెంకటరాముడు పొలంలో మొక్కజొన్న పైరుకు మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. పక్కనే ఉన్న రైతు జేమ్స్ పొలంలో డ్రమ్ము తీసుకురావడానికి మనోహర్ వెళ్లాడు. జేమ్స్ తన చీనీ పండ్ల మొక్కలు, కంది పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ వైర్ తాకి విద్యుదాఘాతానికి గురై మనోహర్ అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుదాకర్ రెడ్డి, ఎస్ఐ మారుతిశంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యుత్ శాఖ అనుమతి లేకుండా పొలం చుట్టూ విద్యుత్ కనెక్షన్ ఇచ్చి తన కుమారుడి మరణానికి కారణమైన జేమ్స్‌పై చర్యలు తీసుకోవాలని మృతుని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మృతిచెందిన మనోహర్


బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై కేసు కొట్టివేత

నందికొట్కూరు: 5 ఏళ్ల క్రితం పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై నమోదైన కేసును నందికొట్కూరు కోర్టు కొట్టివేసింది. 2017లో బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో హంద్రీనీవాలో ఏసన్న అనే యువకుడు పడి చనిపోయాడు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, అతని అనుచరులతో కలిసి ఆందోళన చేశాడు. ఆ సమయంలో తమ విధులకు ఆటంకం కలిగించారని పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ జరిపిగిన నందికొట్కూరు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తిరుమలరావు కేసు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చినట్లు బైరెడ్డి సిద్ధార్థ తరఫు న్యాయవాది బి. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బొమ్మలసత్రం: బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ (53) నంద్యాల చిన్న చెరువులో దూకి బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. తాలూకా సీఐ మురళీ మోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. రామలక్ష్మమ్మ గత కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. ఈనేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఆటో ఎక్కి నంద్యాల చిన్న చెరువు వద్దకు చేరుకుంది. తర్వాత నీటిలో దూకింది. కొంత సేపటి తర్వాత స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కంది పంటకు నిప్పు



దగ్ధమవుతున్న కంది పంట

తుగ్గలి: మండల పరిధిలోని రామలింగాయపల్లికి చెందిన వలంటీర్ ఆకులేటి గోవిందు 6 ఎకరాల్లో సాగు చేసిన కంది పంటకు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో పంట పూర్తిగా కాలిబూడిదైంది. గోవిందు రెండు రోజుల క్రితమే పంట కోసి నూర్పిడి కోసం పొలంలో ఉంచాడు. ఈలోగా గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పొలం వద్దకు పరుగులు తీశారు. ఆర్పే అవకాశం లేక పోవడంతో పంట మొత్తం క్షణాల్లోనే కాలిపోవడంతో బాధిత రైతు బోరున విలపించాడు. దాదాపు రూ.1.30లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.